క్లుప్తంగా

మహిళా వైద్యుల పాత్ర పెరిగింది



మహిళా వైద్యులను సత్కరిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం సందర్భంగా స్థానిక మెడ్ యునైటెడ్ ఆస్పత్రి ఆవరణలో డాక్టర్ మల్లిక, డాక్టర్ సీతూలను మహిళా వాకర్స్ శనివారం సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు శ్రీపాద శ్రీనివాస పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుతం వైద్య రంగంలో మహిళా వైద్యుల పాత్ర, ప్రాధాన్యత పెరిగాయన్నారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ జోన్ చైర్‌పర్సన్ పచ్చిగోళ్ల సత్యకుమారి, క్లబ్ కార్యదర్శి యర్రమిల్లి అనంతలక్ష్మి, క్లబ్ మాజీ అధ్యక్షురాలు పుత్సా రాజేశ్వరి, క్లబ్ కోశాధికారి కె.విజయలక్ష్మి, బులిటన్ ఎడిటర్ పుత్సా కృష్ణ కామేశ్వర్, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, భమిడిపాటి కనకాద్రి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నేడు తాళ్లరేవులో ఉచిత వైద్య శిబిరం

తాళ్లరేవు: నవభారత్ గ్రామీణాభివృద్ధి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సంస్థ చైర్మన్ అంగాడి రేవతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ అపోలో ఆస్పత్రి వైద్య నిపుణులు, సిబ్బంది బీపీ, షుగర్, గుండె, గ్యాస్ట్రో, డెంటల్, కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని మండలవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైల్వేలైన్ వేగంగా పూర్తి చేయాలి

తాళ్లరేవు: కోటిపల్లి–నరసాపురం రైల్వేలైన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని బాలయోగి సాధన సమితి నాయకులు ఉంగరాల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం ఆయన తాళ్లరేవులో విలేకర్లతో మాట్లాడుతూ రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు కోసం రూ.300 కోట్ల నిధులు మంజూరు చేసిన ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్, అమలాపురం ఎంపీ చింతా అనూరాధలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోకన్వీనర్‌గా పవన్ సూర్య

అమలాపురం టౌన్: ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోకన్వీనర్‌గా అమలాపురానికి చెందిన పెయ్యల పవన్ సూర్య నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు పవన్ సూర్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నపూర్‌అజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గాల ఓటర్ల జాబితాలను అభ్యర్థిస్తూ వినతి పత్రం అందించారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎన్‌వీఎస్ రామారావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోకల వరదరాజ శాంచి, గుడిపాటి విజయకుమార్ తదితరులు పవన్ సూర్యను అభినందించారు.

మహాధర్నాకు తరలి రావాలి

తాళ్లరేవు: ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఈ నెల 8న విజయవాడలో నిర్వహించనున్న మహాధర్నాకు తరలిరావాలని ఆశా వర్కర్స్ యూనియన్ తాళ్లరేవు కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో జరిగిన ఆశ వర్కర్ల సర్వసభ్య సమావేశంలో సంఘ కార్యదర్శి ఆర్.నాగలక్ష్మి మాట్లాడుతూ ఆశల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షురాలు పి.అనంతలక్ష్మి, శ్రీదేవి, అమ్మాజీ, విమల పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

అల్లవరం: మండలంలోని ఓడలరేవు సముద్ర తీరంలో వద్ద సరుగుడు తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై శనివారం సాయంత్రం అమలాపురం రూరల్ సీఐ వీరబాబు ఆధ్వర్యంలో దాడి చేసి 11 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి కారు, మూడు మోటారు సైకిళ్లు, రూ.42,120 నగదుని స్వాధీనం చేసుకున్నారు. తీరంలో పేకాట ఆడుతున్న విషయంపై స్థానికులు 100కి కాల్ చేసి ఇచ్చిన సమాచారం ఆధారంగా దాడి చేశామని సీఐ వీరబాబు తెలిపారు.

నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలి

అమలాపురం రూరల్: విశాఖపట్టణంలో తహసీల్దార్ రమణయ్యను హత్య చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని రాష్ట్ర రెవెన్యూ చైర్మన్ వాసా శామ్యూల్ దివాకర్ డిమాండ్ చేశారు. శనివారం అమలాపురంలో జరిగిన జిల్లా వీఆర్వోల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తహసీల్దార్ రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రెవెన్యూ ఉద్యోగుల తరఫున ప్రభుత్వాన్ని కోరారు. భూవివాదాలున్న మండలాల తహసీల్దార్లకు, వీఆర్వోలకు ప్రభుత్వం ప్రత్యేక రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు సాధనాల, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మద్దాల బాపూజీ, గౌరవ అధ్యక్షుడు అల్లాడి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



జై జగన్ నినాదాలు చేస్తున్న కాట్రేనికోన మండల కార్యకర్తలు



తాళ్లరేవులో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న ఎంపీపీ రాయుడు సునీత



ముమ్మిడివరంలో జెండా ఊపి బస్సులను ప్రారంభిస్తున్న నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్



అమలాపురం నుంచి సిద్ధం సభకు తరలుతున్న బస్సులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి

సీఎం జగన్ పిలుపే ఓ ప్రభంజనం

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- దెందులూరు సభకు భారీగా తరలివెళ్లిన పార్టీ నేతలు, కార్యకర్తలు

అమలాపురం రూరల్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపే ఒక ప్రభంజనమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శనివారం అమలాపురం మండలం నడిపూడిలో బాబూ జగ్జీవన్‌రామ్ సామాజిక భవనం నుంచి ఏలూరు జిల్లా దెందులూరు సిద్ధం సభకు తరలివెళుతున్న బస్సులను మంత్రి విశ్వరూప్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ సీఎం జగన్ పిలుపుతో సిద్ధం సభకు తరలివెళుతున్న లక్షలాది మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్ర చరిత్రలోనే సిద్ధం సభ ఒక అద్భుతమని, ఈ సభ ద్వారా సీఎం జగన్ ఎన్నికల శంఖారావానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో కార్యకర్తలు, నాయకులు మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. సిద్ధం సభకు జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి, ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి దోలామణి, సర్పంచ్‌లు చెల్లుబోయిన నాని, నక్కాఅరుణకుమారి, దాసరి అరుణ, గుత్తుల చిరంజీవి, ఉపసర్పంచ్ కామిశెట్టి శ్రీనివాస్, పట్టణ, రూరల్ వైఎస్సార్ సీపీ అధ్యక్షులు సంసాని చంద్రశేఖర్(బులినాని), బొంతు గోవింద శెట్టి, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, ఉండ్రు వెంకటేశ్, నక్కా సంపత్ కుమార్, సూదా గణపతి తదితరులు తరలివెళ్లారు.

ఉప్పలగుప్తం: మండలంలో మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు సిద్ధం సభకు తరలివెళ్లారు. ప్రతి గ్రామంలోనూ వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడాయి. కార్యకర్తలంతా జై జగన్ అనే నినాదాలతో హోరెత్తించారు.



సిద్ధం యాత్రకు జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: ఏలూరు జిల్లా దెందులూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం బహిరంగ సమావేశానికి అల్లవరం మండలం నుంచి పార్టీ శ్రేణులు భారీగా తరలివెళ్లారు. శనివారం ఉదయం సిద్ధం మహాసభకు తరలివెళ్తున్న బస్సులకు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పార్టీ జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. అల్లవరం మండలంలో వివిధ గ్రామాల నుంచి 20 బస్సులు, మరో 10 కారుల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారని ఎంపీపీ శేషగిరిరావు తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొనుకు బాపూజీ, జీవీకే చైర్మన్ తిక్కా ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షులు యల్లమిల్లి బోసు, టీపీసీ మెంబర్ కుడుపూడి శ్రీను, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాళ్లరేవు: దెందులూరులో జరిగిన సిద్ధం సభకు తాళ్లరేవు మండలం నుంచి భారీగా పార్టీ శ్రేణులు తరలివెళ్లారు. మండల కేంద్రమైన తాళ్లరేవు చెరువు గట్టు సెంటర్ వద్ద ఎంపీపీ రాయుడు సునీత జెండా ఊపి బస్సులను ప్రారంభించారు. సుంకరపాలెం, పోలేకుర్రు, పి.మల్లవరం, ఇంజరం, జి.వేమవరం, చొల్లంగి తదితర గ్రామాల నుంచి బస్సుల్లో అధిక సంఖ్యలో జనం తరలివెళ్లారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలనే లక్ష్యంతో ఐక్యంగా తామంతా కలిసికట్టుగా పనిచేస్తున్నామని వారు తెలిపారు. జై జగన్, జైజై జగన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, వైస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ఆకుల వెంకటేశ్వర్లు, బి.శ్రీనివాసరెడ్డి, కొల్లు శ్రీను, బి.శ్రీనివాస రెడ్డి, నందికోళ్ల శ్రీమన్నారాయణ, కొప్పిశెట్టి వెంకట్, బొంతు మోహన్, పొన్నాడ భైరవమూర్తి, కొల్లు బాబు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ఏలూరు జిల్లా దెందులూరులో జరిగిన సిద్ధం సభకు ముమ్మిడివరం నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు. ముమ్మిడివరం, ఐ.పోలవరం, తాళ్లరేవు, కాట్రేనికోన మండలాల నుంచి వందలాది బస్సులు, కార్లలో బయలుదేరి నియోజకవర్గ కేంద్రమైన ముమ్మిడివరం పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు పెన్మత్స చిట్టిరాజు, పెయ్యల చిట్టిబాబు, కోలా బాబ్జి, జగతా పద్మనాభం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. మండల పార్టీ కన్వీనర్లు పిన్నమరాజు వెంకటపతిరాజు, కాదా గోవిందకుమార్, నల్లా నరసింహమూర్తి, నడింపల్లి సూరిబాబు సభకు తరలివెళ్లారు.

అమలాపురం టౌన్: ఏలూరు జిల్లా దెందులూరులో జరిగిన వైఎస్సార్ సీపీ సిద్ధం సభకు అమలాపురం నియోజకవర్గం నుంచి వేలాదిగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కార్లు, ప్రత్యేక బస్సుల్లో శనివారం ఉదయం తరలివెళ్లారు. పట్టణంలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రధాన రోడ్డులో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి జెండా ఊపి బస్సుల యాత్రను ప్రారంభించారు. అలాగే పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని ఆధ్వర్యంలో కూడా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. మున్సిపల్ కౌన్సిలర్లు బండారు గోవిందు, చిత్రపు రామకృష్ణ, దొంగ నాగ సుధారాణి, యండమూరి మంగ, రాజీ గోపి, యన్నాబత్తుల పద్మ, నాగారపు వెంకటేశ్వరరావు, కొల్లాటి దుర్గాబాయి, గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు తదితరుల ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సభకు బయలుదేరి వెళ్లారు. నియోజకవర్గం నుంచి దాదాపు 300 కార్లలో, 80 బస్సుల్లో కార్యకర్తలు తరలి వెళ్లడంతో బస్సు యాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

కాట్రేనికోన: ఏలూరు జిల్లా దెందులూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్వహించిన సిద్ధం సభకు ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ నాయకత్వంలో పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మండల పరిధిలోని చెయ్యేరు, పెనుమల్లే, బంటుమిల్లి, లక్ష్మివాడ, ఉప్పూడి, కాట్రేనికోన, గచ్చకాయలపోర, చిర్రయానం, నడవపల్లి, కుండలేశ్వరం, నడవపల్లి, దొంతికుర్రు, గెద్దనపల్లి, కందికుప్ప, పల్లంకుర్రు, పల్లం, బలుసుతిప్ప, కొత్తపాలెం, పోర, మొల్లేటి మొగ తదితర గ్రామాల నుంచి 23 బస్సులు, 20 కార్లలో కార్యకర్తలు బయలుదేరి వెళ్లారు. కార్యక్రమంలో నేల కిషోర్, నాతి సత్యనారాయణ, నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, ఏడిది సుబ్బు, పాలెపు ధర్మారవు, సంసాని నాగేశ్వరరావు, సానబోయిన ఏసు, నాతి అలివేణి, నల్లా బేబిజానకి తదితరులు పాల్గొన్నారు.

నవోదయ విద్యార్థులు, టీచర్లకు సత్కారం

యానాం: గత నెల 29న న్యూఢిల్లీలోని భారత మండపంలో పరీక్షాపే చర్చా కార్యక్రమంలో పాల్గొన్న యానాం జవహర్ నవోదయ విద్యార్థులు దుర్గేష్, సతీష్‌కుమార్‌లతో పాటు ఆర్ట్ టీచర్ పొడగంటి వెంకటేశ్వర్లును ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు మాట్లాడుతూ ప్రధాని మోదీ స్వయంగా తమ విద్యార్థులతో మాట్లాడి వారు ప్రదర్శించిన కల్చర్ అండ్ హెరిటేజ్ చిత్రాలను, ఏటికొప్పాక లక్కబొమ్మలను తిలకించి అభినందించడం సంతోషదాయకమన్నారు. అనంతరం ఆర్ట్ అండ్ కల్చర్ వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎస్‌కే బేగం, సీనియర్ అధ్యాపకులు సాంబశివరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులు, టీచర్లను సత్కరించిన ప్రిన్సిపాల్ ప్రకాశరావు

శరవేగంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్

అల్లవరం: పేదలందరికీ ఇళ్లు పథకంలో అర్హులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు హక్కు కల్పించేందుకు చేపట్టిన స్థలాల రిజిస్ట్రేషన్‌ను శరవేగంగా నిర్వహిస్తున్నారు. మండలంలోని 23 సచివాలయాల పరిధిలో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ, లబ్ధిదారుని ఈకేవైసీ ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టారు. మండలంలోని 23 సచివాలయాల్లో 2,113 మందికి ఇళ్ల స్థలాల పట్టాలను ప్రభుత్వం అందించగా శనివారం సాయంత్రానికి 300 మందికి రిజిస్ట్రేషన్ పూర్తయిందని డిప్యూటీ తహసీల్దార్ వీరవెంకట సత్యనారాయణ తెలిపారు. తాడికోనలోని అన్ని సచివాలయాల్లో ఆదివారం ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ నిర్వహిస్తామని, లబ్ధిదారులు వినియోగించుకోవాలన్నారు. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి రిజిస్ట్రేషన్‌ను పరిశీలించారు.



తాడికోనలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్‌ను పరిశీలిస్తున్న డీటీ వీర వెంకట సత్యనారాయణ

దళిత సింహ గర్జనకు తరలి రండి

తాళ్లరేవు: ఈ నెల 11వ తేదీన రాజమహేంద్రవరం సమీపంలోని వేమగిరిలో జీవీ హర్షకుమార్ నేతృత్వంలో నిర్వహించే దళిత సింహ గర్జన కార్యక్రమానికి దళితులంతా తరలి రావాలని దళిత నాయకుడు దడాల బుజ్జిబాబు కోరారు.

ఆలయ వార్షికోత్సవం

రావులపాలెం: మండలంలోని ఊబలంక షిరిడీ సాయిబాబా ఆలయ 24వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం బాబా వారిని గ్రామంలో పల్లకిపై ఊరేగించారు. ఊరేగింపులో డప్పు వాయిద్యాలు, శక్తి వేషాలు, కోలాటం, తదితర నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా భక్తులు బాబావారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

హోంగార్డులకు ఫిజికల్ ఫిట్‌నెస్ టెస్ట్

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లలో 500 హోంగార్డు పోస్టుల భర్తీ నిమిత్తం శనివారం నుంచి అభ్యర్థులకు ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహిస్తున్నారు. మొత్తంగా 420 మంది పురుష, 80 మంది మహిళా హోంగార్డులను ఎంపిక చేయనున్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గోరిమేడు ఆర్మ్‌డ్ ఫోర్స్ గ్రౌండ్స్‌లో జరిగే ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలను హోంమంత్రి నమశ్శివాయం ప్రారంభించారు. మొదటిరోజు 500 మందికి గాను 292 మంది హాజరుకాగా 208 మంది వివిధ కారణాల రీత్యా గైర్హాజరయ్యారు. అభ్యర్థుల అడ్మిట్ కార్డు, సంబంధిత డాక్యుమెంట్లను పరీక్షించడంతో పాటు ఎత్తు, ఛాతీ కొలవడం, హైజంప్, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 19వ తేదీ నాటికి పురుష అభ్యర్థుల ఎంపిక పూర్తి చేస్తామని, మహిళలకు 20 నుంచి 23వ తేదీ వరకూ ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్షలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీజీపీ శ్రీనివాస్, డీఐజీ బ్రిజేంద్ర కుమార్, ఎస్పీ రంగనాథన్, స్వాతిసింగ్, భాస్కరన్ పాల్గొన్నారు.

‘ఉపాధి’లో అక్రమాలు జరిగితే ఫిర్యాదు చేయండి

మామిడికుదురు: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో అక్రమలు జరిగితే ఫిర్యాదు చేయాలని అంబుడ్స్‌మన్ ఎం.జ్యోతి అన్నారు. మామిడికుదురు మండల పరిషత్ కార్యాలయం వద్ద శనివారం ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ సభ జరిగింది. 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి వరకు మండల పరిధిలో చేపట్టిన పనులపై డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ సమీక్షించారు. ఉపాధి హామీ ద్వారా 888 పనులను నిర్వహించారన్నారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి 28 పనులు చేపట్టామని చెప్పారు. ఉపాధి హామీకి సంబంధించి కూలీల వేతనాలు, మెటీరియల్‌కు సంబంధించి రూ.3.42 కోట్లు చెల్లించారని చెప్పారు. పీఆర్‌కు సంబంధించి రూ.2.06 కోట్లు చెల్లించామన్నారు. పీఆర్ పనుల్లో రూ.3.20 లక్షలు తేడాలు ఉన్నాయన్నారు. వీటికి సంబంధించి రూ.70 వేలు రికవరీ చేయాలని ఆదేశించారు. ఉపాధి పనులకు సంబంధించి రూ.20 వేలు రికవరీ చేశారు. సమావేశంలో జిల్లా విజిలెన్స్ అధికారి కె.భీమేశ్వర్, ఏపీఓ రమేష్‌బాబు, ఏఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంబుడ్స్‌మన్ జ్యోతి

ఆందోళన తాత్కాలికంగా విరమణ

ఉప్పలగుప్తం: మండలంలోని ఎస్.యానం గ్రామంలో ఉన్న వేదాంత, కెయిన్ ఎనర్జీ అనుబంధ సంస్థ అయిన రవ్వ పరిశ్రమకు వెళ్లే మార్గంలో గ్రామస్తులు చేపట్టిన ఆందోళన శనివారం రాత్రి 11 గంటల సమయంలో తాత్కాలికంగా విరమించారు. మంత్రి విశ్వరూప్, జిల్లా ఉన్నతాధికారులతో ఇప్పటికే చర్చించామని, ఈ నెల 13న అధికారులతో సమావేశమై న్యాయం చేస్తామని డీఎస్పీ అంబికాప్రసాద్ హామీ ఇవ్వడంతో గ్రామస్తులు వెనక్కి తగ్గారు. ఎంపీటీసీ పెట్టా అప్పారావు, జోగిరాజులు వచ్చి గ్రామస్తులకు సర్ది చెప్పారు. అయితే నిబంధనలను అతిక్రమించి పరిశ్రమ కార్యకలాపాలను అడ్డుకుంటూ ధర్నా చేస్తున్న ఆందోళనకారులపై కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.మనోహర జోషి తెలిపారు.



ఎస్.యానంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఆలయ నిర్మాణానికి రూ.50 వేల విరాళం

ఆలమూరు: మండలంలోని మడికిలో ఆలయ నిర్మాణానికి కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. ఇటీవల గ్రామంలో పర్యటన సందర్భంగా నాలుగో వార్డు మహిళలు తమ ప్రాంతంలో ఆలయాన్ని నిర్మించుకునేందుకు సహాయ సహకారాలను అందించాలని విజ్ఞప్తి చేయగా ఎమ్మెల్యే జగ్గిరెడ్డి సానుకూలంగా స్పందించారు. తమ వంతు సాయంగా ప్రకటించిన విరాళాన్ని శుక్రవారం సాయంకాలం వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు స్వయంగా ఆ ప్రాంతానికి వెళ్లి అందజేశారు. అడిగిన వెంటనే ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి గ్రామ మహిళలు కృతజ్ఞతలు తెలిపారు.



మడికిలో ఆలయ నిర్మాణానికి విరాళాన్ని అందజేస్తున్న తమ్మన శ్రీనివాస్

గోమాతకు ప్రథమ వర్ధంతి




గుమ్మిలేరులో గోమాతకు ప్రథమ వర్ధంతి నిర్వహిస్తున్న రైతు సత్తిబాబు

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరులో గోమాతకు ప్రథమ వర్ధంతి జరిగింది. గ్రామానికి చెందిన పశుపోషకుడు రెడ్డి సత్తిబాబు పశువుల మకాంలో ఇంట పుట్టిన ఆవు గత ఏడాది మృతి చెందింది. దీంతో రైతు సత్తిబాబు ఆ గోమాత పట్ల ఉన్న ప్రేమతో తమ ఇంట్లో కుటుంబసభ్యులకు జరిపించే విధంగానే అప్పట్లో అంత్యక్రియలు చేసి దశదిన కర్మ నిర్వహించారు. ఆ గోమాత మృతి చెంది ఏడాది కావడంతో రైతు సత్తిబాబు దంపతులు గోమాత సమాధి వద్ద శనివారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ప్రథమ వర్ధంతి జరిపారు. అనంతరం పరిసర ప్రాంతవాసులకు అన్నసమారాధన నిర్వహించారు. ఇంట పుట్టిన గోమాతకు ఇటువంటి కార్యక్రమాలు చేయడంపై స్థానికంగా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామ సర్పంచ్ గుణ్ణం రాంబాబు, రైతులు రెడ్డి జానకిరామయ్య, యార్లగడ్డ రమేష్ చౌదరి, గుణ్ణం శ్రీనివాస్, రెడ్డి చిట్టిబాబు, యార్లగడ్డ వీర్రాజు, వీరపనీడి బోసు, రెడ్డి నారాయణరావు, కాకర్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శనైశ్చరునికి తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండలంలోని మందపల్లిలో వేంచేసిన ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామిని శనివారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు జరిపించారు. ప్రాతఃకాల అర్చన అనంతరం భక్తులకు స్వామి దర్శనం కల్పించారు. దేవదాయ శాఖ ఏసీ, ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు. తైలాభిషేకాల ద్వారా రూ.1,06,103, ఎంటల ద్వారా రూ.3,828, అన్నప్రసాదం విరాళాల రూపంలో రూ.36,958 దేవస్థానానికి ఆదాయం వచ్చినట్టు ఏసీఅండ్ఈఓ తెలిపారు.

కొత్తపేట ఆర్డీవోగా సత్యనారాయణ



కొత్తపేట: కొత్తపేట ఆర్డీవోగా జీవీవీ సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఆర్డీవోగా పనిచేసిన ఎం.ముక్కంటి ఏలూరు బదిలీ కాగా ఆయన స్థానంలో అక్కడ డిప్యూటీ కలెక్టర్ (కేఆర్ఆర్‌సీ)గా పనిచేసిన సత్యనారాయణ బదిలీపై వచ్చారు. ఆయనకు ఆర్డీవో కార్యాలయం అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, డీటీలు, ఇతర అధికారులతో సమావేశమయ్యారు.